క్లుప్తంగా

మైనర్ వివాహంపై కౌన్సెలింగ్

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో జరిగిన మైనర్ బాలిక వివాహంపై కుటుంబసభ్యులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సహాన, ఎల్‌డీసీ లక్ష్మీలు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలిక తల్లి అధికారులకు వివరణ ఇస్తూ.. తన ఆరోగ్యం బాగాలేదని, భర్త బాలిక చిన్నప్పుడే వదిలేశాడని తెలిపారు. దీంతో తనకు వచ్చే పింఛన్‌తోనే కుటుంబ పోషణ చేపడుతున్నానని, తాను బతికి ఉండగానే కూతురుకి పెళ్లి చేయాలనే ఉద్దేశంతో వివాహం జరిపించామని వెల్లడించారు. బాలికకు 18 ఏళ్లు వచ్చిన తర్వాతనే అబ్బాయి ఇంటికి పంపిస్తానని గ్రామ పెద్దల సమక్షంలో హామీ పత్రం రాసి అధికారులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ సరియం రాజమ్మ, గుడ్ల రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యర్థాలతో పంటలకు నష్టం

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ వ్యర్థ జలాలతో పంటలు దిగుబడులు రావడం లేదని, దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ అన్నారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఐటీసీ పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాలను పంటలకు వినియోగిస్తున్న రైతులు గత రెండేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఐటీసీ వ్యర్థ జలాల్లో ఫెర్టిలైజర్స్‌ను కలిపి బయటకు వదిలేవారని, ఇప్పుడు కెమికల్స్, యాసిడ్స్‌ను వదులుతున్నారని ఆయన ఆరోపించారు. విషయంలో ఐటీసీ ఉన్నతాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రచార రథాలు ప్రారంభం

చర్ల: చర్లలో పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథాలను సోమవారం కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రారంభించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మడకం పద్మజ, సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ, గండేపూడి భాస్కర్‌రావు, చీమలమర్రి మురళీ కృష్ణ, ఇందుల బుచ్చిబాబు తదితరులు లాంఛనంగా ప్రచార రథాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు, రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతీ కార్యకర్త పట్టుదలతో పని చేయాలన్నారు. నాయులు సాల్మన్‌రాజు, తోటమళ్ల వరప్రసాద్, బండి వేణు, పటేల్ వెంకటేశ్వారవు, తాటి రామకృష్ణ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజన మహిళను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన గిరిజనేతరుడు బైరెడ్డి వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళను కులం పేరుతో దూషించి దాడి చేసిన్నట్లు ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కల్లూరి లక్ష్మణరావు, రాజేష్, వెంకటేశ్వరరావు, రాంబాబు, రమేష్, సీతారాములు, మల్లూరు, సుభద్ర, లక్ష్మి, తిరుపతి, రమాదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీ కుర్వాపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన మడకం శ్రీను తల్లి అక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందగా.. సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అక్కమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు బట్టా విజయగాంధీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని మారుతీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాల్లో చేరిన్నట్లు కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎల్ఎల్ కాంతారావు, చైర్మన్ సుబ్బరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో బీఎస్సీ పూర్తి చేసిన 40 విద్యార్థినులు హైదరాబాద్‌లోని ఒమేగా హాస్పటల్‌లో ఉద్యోగాలు సాధించి విధులకు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

బస్సు యాత్రకు తరలిరండి

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించే బస్సు యాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ.. బస్సు యాత్ర, కార్నర్ మీటింగ్‌కు అశ్వారావుపేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులంతా హాజరై విజయవంతం చేయాలని అన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి

- బీజేపీ, బీఆర్ఎస్‌తో ఒరిగిందేమీ లేదు..
- ప్రచార సభల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాఘురాంరెడ్డి

ములకలపల్లి/అన్నపురెడ్డిపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డి అన్నారు. సోమవారం అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పది సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ రాష్ట్రానికి అన్యాయం చేసిందని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ వల్ల ప్రజలకు ఒరిగేదేమి లేదని విమర్శించారు. బీజేపీ రాముడి పేరుతో ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని, 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోదీ ఒకరికీ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. వ్యక్తిగత తగాదాలను పక్కన పెట్టి పార్టీ గెలుపునకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గం నుంచి తాము 50 వేల మెజార్టీ ఇస్తామని, అయితే తమ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీ అభ్యర్థిని కోరారు. తొలిత ములకలపల్లి శిశుమందిర్ విద్యాలయం నుంచి సాయిబాబ ఆలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మువ్వా విజయ్‌బాబు, బాలసాని లక్ష్మీనారాయణ, బీబీ స్వర్ణకుమారి, అన్నపురెడ్డిపల్లి మండలాధ్యక్షుడు వనమా గాంధీ, ములకలపల్లి మండల అధ్యక్షుడు ప్రభాకరరావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజీ, సీపీఐ రాష్ట్ర సమితిసభ్యుడు సరాటి ప్రసాద్, వేముల రమణ, బాణావత్ భీముడు, పర్సావెంకటేశ్వర్లు, సీపీఎం, సీపీఐ ములకలపల్లి మండల కార్యదర్శులు ముదిగొండరాంబాబు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి సతీమణి ప్రచారం..

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం నియోజకవర్గం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామ సహాయం రఘురాంరెడ్డిని మండల ప్రజలు ఆశీర్వదించి, ఎంపీగా గెలిపించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురిరెడ్డి కోరారు. సోమవారం రాత్రి మండలంలోని పార్కలగండి, కొత్తూరు, అంకంపాలెం, కొడిశెలగూడెం, జగ్గారం, బాలరాజుగూడెం, గండుగులపల్లి గ్రామాల్లో, ఖమ్మం ఎంపీ అభ్యర్థి గెలుపును ఆకాంక్షిస్తూ.. మాధురిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలసి రోడ్‌షోలు నిర్వహించారు. ఈ రోడ్‌షోలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, రఘురాంరెడ్డిని సహృదయంతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటగిరి సత్యంబాబు, రావు గంగాధరరావు, కొయ్యల అచ్యుతరావు, సోయం ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, ఎల్లిన రాఘవరావు, కొర్సా సాగర్, రావు రవిశంకర్, రాధకృష్ణ, పగడాల రాంబాబు, మల్లేశ్వరరావు, గోపి, వెంకటేశ్వరరావు, కృష్ణ, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో విభేదాలు బహిర్గతం



సభ వేదికపై కాంగ్రెస్ సీనియర్ నాయకుల మధ్య వాగ్వాదం

అన్నపురెడ్డిపల్లి: మండల కాంగ్రెస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. సోమవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురామిరెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తు ఏర్పాటు చేసిన సమావేశంలో విభేదాలు ఒక్కసారిగా బయటబడ్డాయి. పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ వేదిక పైకి పలువురి నాయకులను ఆహ్వానించే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పార్టీ మారీ మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చిన ఓ నాయకురాడిని మండలాధ్యక్షుడు సభ వేదిక మీదకు పిలవడంతో, అక్కడే ఉన్న మరో ముఖ్యనాయకుడు అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో సదరు నాయకుడు సభ వేదిక పైకి రాకుండా వెనుతిరిగి వెళ్లిపోయాడు. సమావేశం అనంతరం పార్టీ బాధ్యుడు మైక్ తీసుకుని చాలా మంది పార్టీ నుంచి వెళ్తుంటారు.. వస్తుంటారు.. ఈ విధంగా ప్రవర్తించడం మంచిది కాదని చెప్పడంతో వాగ్వాదం మొదలైంది. సభలో గందరగోళం నెలకొంది. పార్టీ ముఖ్యులు సర్ది చెప్పి అందరూ కలిసి పనిచేయాలని కోరి, అక్కడి నుంచి వెళ్లాపోయారు. మొత్తంగా ఎన్నికల సమయంలో వచ్చిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడంపై సీనియర్ నాయకులు, పార్టీలో ఒకరిద్దరు పెత్తనం చేస్తున్నారంటూ సామాన్య కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఓ ఖుర్షిద్

అశ్వారావుపేటరూరల్: ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని, జాప్యం చేస్తే సహించేది లేదని డీసీఓ ఖుర్షిద్ అన్నారు. సోమవారం అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లి, జమ్మిగూడెం, నారాయణపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల్లో విక్రయిస్తున్న రైతులకు పెండింగ్ లేకుండా చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా ఆదేశాలు జారీ చేశామని, వైద్య శాఖతో సమన్వయం చేసుకోని కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామని అన్నారు. కేంద్రాలకు వచ్చే రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ విజయ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బూర్గంపాడు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సారపాక ప్రధాన కూడలిలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. వాహనాల అనుమతి పత్రాలను పరిశీలించటంతో పాటు నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఎవరైనా అత్యవసరమైతే తప్ప నగదును వాహనాలలో తీసుకెళ్లవద్దని, తప్పనిసరి అనుమతులుండాలని పోలీసులు తెలిపారు.

మండే ఎండ.. గొడుగే అండ!



మండే ఎండలో గొడుగు నీడలో తల్లి, కుమారుడు

కరకగూడెం: మండలంలో ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతుండంతో జనాలు అల్లాడుతున్నారు. వేసవి తాపానికి బయటపడడానికి ప్రజలు నానా రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉక్కపోత తప్పడం లేదు. ఈ క్రమంలో సోమవారం పద్మాపురం గ్రామంలోని బుగ్గ చెరువు వద్ద చేపలు పట్టడానికి ఓ మాతృమూర్తి తన కుమారుడితో వచ్చింది. ఎండ నుంచి తన కుమారుడు బయట పడడానికి గొడుగు చేతబట్టి దాని నీడను ఆశ్రయించింది. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

మతోన్మాద బీజేపీని ఓడించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

భద్రాచలంఅర్బన్: దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బ తీసే మతోన్మాద బీజేపీని, దాని మిత్రపక్షాలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ పిలుపునిచ్చారు. సీపీఎం పట్టణ కమిటీ సమావేశం ఎంబి.నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం మినహా మిగతా 16 నియోజకవర్గాల్లో ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు ఇస్తుందని అన్నారు. పార్లమెంటులో ప్రశ్నించే గొంతుక ఉండాలంటే కమ్యూనిస్టులు ఉండాలని, భువనగిరి సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటరామారావు, పి.సంతోష్ కుమార్, టౌన్ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, జ్యోతి, నాగరాజు, కుంజా శ్రీనివాస్, ఎస్‌డి.ఫిరోజ్, భూపేంద్ర పాల్గొన్నారు.

మళ్లీ గెలిస్తే ఎవరూ బతకలేరు..

చర్ల: కేంద్రంలో రెండు పర్యాయాలు గద్దెనెక్కిన బీజేపీ మోదీ.. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసిందని, మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఎవ్వరూ బతకలేరని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చర్లలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీని మళ్లీ అధికారంలోకి రానిస్తూ కార్మికులు, కర్షకులు, రైతులు, కూలీలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ఏ మాత్రం భద్రత ఉండదని ఆయన అన్నారు. పార్టీ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, ఏఐటీయూసీ నాయకులు మాల్యాద్రి, ఎస్‌కె.ఖాజా, నాయకులు రాము, శ్రీను, రాజు, చుక్కయ్య, మంగమ్మ, నరసమ్మ, రాజారావు, నాగేశ్వరావు, గాంధీ, కన్నయ్య, రమేష్, లక్ష్మి, రమా పాల్గొన్నారు.

కంప్యూటర్, యోగా ఉచిత శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్‌లో ఉన్న శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల వద్ద రేపటి(బుధవారం) నుంచి మే 17 వరకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, యోగ క్లాసులు, బుక్ రీడింగ్, కోలాటంలో శిక్షణ ఇవ్వనున్నట్లు శిశు మందిర్ సంస్థ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు 8 సంవత్సరాలు నుంచి పైబడిన పిల్లలు అందరూ అర్హులేనని ఆయన తెలపారు. ప్రతి రోజు శిక్షణ తరగతులు ఉదయం 9 గంటల నుంచి 11:30కు ఉంటాయని, తరగతులకు హాజరయ్యే వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌కు ప్రధానోపాధ్యాయురాలు మరింగంటి గీత సెల్ 9866030337 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీకి ఫీజు చెల్లించండి

అశ్వారావుపేటరూరల్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష రాసే విద్యార్థులు పరీక్షా ఫీజును వచ్చే నెల 2వ తేదీలోపు చెల్లించాలని అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఒక సబ్జెక్టు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులైనా రూ.510 రూపాయాలను వచ్చే నెల 2వ తేదీన సాయంత్రం 4గంటలలోపు కళాశాల కార్యాలయంలో చెల్లించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే మార్పు

దుమ్ముగూడెం: దేశంలో మార్పు రావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, బడుగు బలహీన వర్గాలకు మేలు చేసేది కాంగ్రెస్ పార్టీనే అని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బాలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని బుర్రవేముల గ్రామంలో ప్రచారం ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు సైనికులుగా పనిచేయాలన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించిలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అబ్బులు, శ్రీధర్, కెల్లా శేఖర్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపరచాలి

బూర్గంపాడు: సారపాక ఈఎస్ఐ డిస్పెన్సరీలో వైద్యసేవలను మెరుగుపరచాలని సీపీఐ జిల్లా నాయకులు పేరాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతనాల నుంచి ప్రతినెలా కోట్లాది రూపాయలు ఈఎస్ఐకి చెల్లిస్తున్నారని, కాని కార్మిక కుటుంబాలకు ఈఎస్ఐలో మొక్కుబడిగా వైద్యసేవలు అందుతున్నాయని ఆరోపించారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షించాలని కోరారు.

మణుగూరు మెజిస్ట్రేట్‌గా సూరిరెడ్డి



నూతన మెజిస్ట్రేట్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

మణుగూరురూరల్: మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్‌గా సూరిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వర్లు భద్రాచలం కోర్ట్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన మెజిస్ట్రేట్ సూరిరెడ్డికి మణుగూరు బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మాట్లాడుతూ.. కోర్ట్ పరిధిలోని పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు, సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం బదిలీపై వెళ్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లుకు వీడ్కోలు పలికారు. మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్ర రవికుమార్, న్యాయవాదులు దాసరి కవిత, కందిమళ్ల నర్సింహరావు, కుర్మా విజయరావు, రామ్మోహన్‌రావు, పోశం భాస్కర్, పద్మావతి, సంధ్య, శైలజ, సావిత్రి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రాణాలతో చెలగాటం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో యాజమాన్యం ఉద్యోగుల ప్రాణాలతో చలగాటమాడుతోందని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు అన్నారు. ఈ మేరకు ఏరియా జీఎం దృష్టికి సోమవారం కార్మికులు పడుతున్న ప్రధాన సమస్యలు తీసుకెళ్లారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఓపెన్‌కాస్ట్ పనివేళల్లో మార్పులు చేయాలని కోరారు. క్వారీలోని రెస్ట్‌హాల్స్‌కు చలువ పందిళ్లు, క్వారీ సైట్ ఆఫీస్, సీఎస్పీ ఏరియాలలో విపరీతంగా వస్తున్న డస్ట్ కంట్రోల్‌కు ఫుల్ టైం వాటర్ ట్యాంకర్ ఏర్పాటు, ఇంటర్నల్ పార్కింగ్ యార్డ్ నందు ఏసీ రెస్ట్ షెల్టర్, రెస్ట్‌హాల్స్ క్యాంటీన్లలో కూలర్లు, 24 గంటలు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ హాల్ చార్జీల తగ్గింపుతో పాటు సింగరేణి పని చేసి పదవి విరమణ పొందిన కార్మికుల వద్ద రూ.20వేలు వసూలు చేస్తూ వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. సివిల్ క్లీనింగ్ చార్జీలను ఉద్యోగుల వద్ద వసూలు చేస్తూ ఆ డబ్బును ఎందుకు వాడుతున్నారో చెప్పడం లేదన్నారు. సమస్యలపై జీఎం ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ నాయకులు గట్టయ్య, షాబుద్దీన్‌లు తదితరులు ఉన్నారు.

మేడేను జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: మండలంలో మేడే సంబరాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, బొల్లోజు వేణులు పిలుపునిచ్చారు. సోమవారం సీతారాంపురం గ్రామంలో సీపీఐ, ఏఐటీయూసీల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మే1వ తేదీన కార్మిక వర్గాలు సంఘటితంగా కార్మికుల హక్కుల దినోత్సవం మేడే రోజున వాడవాడలా ఎర్రజెండాలు ఎగరవేసి శ్రమజీవుల ఐక్యతను చాటాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వర్ష గౌరయ్య, ఆళ్ల రమేష్, సాధన పల్లి రవి, ఆరేపల్లి లక్ష్మణరావు, సోయం రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరణ

మణుగూరురూరల్: మేడే వేడుకలను జయప్రదం చేయాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార గోడపత్రికలను కూనవరం రైల్వేగేట్ అడ్డాలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడే వేడకలను సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు గురుమూర్తి, ఎం.నాగేశ్వరరావు, శివరామకృష్ణ, కె.నాగేశ్వరరావు, గోపి, నాగరాజు, శ్రీనివాస్, రజబ్ అలీ, సమ్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి మాజీ ఎమ్మెల్యే సాయం



గాయపడిన వ్యక్తి పరిస్థితిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: ప్రమాదానికి గురైన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించేందుకు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సహాయం అందించారు. సోమవారం రేగా కాంతారావు పలు వ్యక్తిగత పనులపై వెళ్తుండగా.. మండల పరిధిలోని దమ్మక్కపేట గ్రామం వద్ద ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. ఈ ఘటనను గమనించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు.. వెంటనే స్పందించి సదరు గాయాలపాలైన వ్యక్తి దగ్గరికి వెళ్లి అతని పరిస్థితిని పరిశీలించారు. ఆయనే 108కు సమాచారం అందించారు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్‌లోకి పలువురి సహాయంతో ఆయన గాయపడిన వ్యక్తిని ఎక్కించారు. వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సహాయం పట్ల పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

ప్రీస్కూల్ డే వేడుకలు



కేశప్పగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ప్రీస్కూల్ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని జమ్మిగూడెం సెక్టార్ పరిధిలోని కేశప్పగూడెం, నారాయణపురం సెక్టర్ పరిధిలోని నారాయణపురం, నారాయణపురం కాలనీ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వేడులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు ఇమ్మడి పద్మావతి, వరలక్ష్మి మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అలాగే ఐదేళ్లు పూర్తైన చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం చిన్నారులకు ప్రొగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు టి.లక్ష్మీకుమారి, పి.వెంకాయమ్మ, ఎస్.సావిత్రి, ఎస్.సుందరి, బి.రాణి, ఎం.వెంకటమ్మ, హెల్పర్ రమణ పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



కరకగూడెం: ఓటుపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కరకగూడెం: ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని సీఆర్పీఎఫ్ డీఎస్పీ వృషాలిని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆమె సోమవారం పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు, అక్కడి నుండి ఎస్సీ కాలనీ మీదుగా టీఎస్ఎస్పీ, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీస్ బలగాలతో సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులకు తావు ఇవ్వకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్సై వెంకటప్పయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చర్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను చైతన్యపరచడంతో పాటు వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు సోమవారం రాత్రి చర్లలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం సెంటర్, అంబేడ్కర్‌సెంటర్, బస్టాండ్‌సెంటర్, గాంధీ సెంటర్ మీదుగా మార్చ్ కొనసాగింది. సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి, సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.



చర్లలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు